గరీబ్‌నగర్ యూపీహెచ్‌సీలో

కాంపౌండరే.. డాక్టర్

- ఐదు నెలలుగా వైద్య సేవలు
- ఖాళీగా డాక్టర్, నర్సు, ల్యాబ్‌టెక్నీషియన్, డ్రగ్గిస్ట్ పోస్టులు



గరీబ్‌నగర్ యూపీహెచ్‌సీ



డాక్టర్ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

బేగంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): పేదలు అధికంగా నివసించే చోట వారికి ఉచితంగా వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యం అందడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బేగంపేట డివిజన్ పాటిగడ్డ మోడల్ మార్కెట్ ప్రాంగణంలోని గరీబ్‌నగర్ యూపీహెచ్‌సీలో ఇద్దరు నర్సులు, డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రగ్గిస్ట్ అందుబాటులో ఉండాల్సి ఉండగా ఎవరూ లేరు. ప్రస్తుతం ఆ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. కాంపౌండర్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇది ఒకటి, రెండు రోజుల నుంచి కాదు ఐదు నెలలుగా అన్నీ తానై వైద్యం చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి తెలిసిన మందులు ఇస్తున్నారు.



మందులు ఇస్తున్న కాంపౌండర్

నిత్యం 80 నుంచి 90 మంది రోగులు..

పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, దేవుడి తదితర బస్తీలకు చెందిన పేదలు వైద్యం కోసం వస్తుంటారు. నిత్యం 80 నుంచి 90 మంది వస్తారు. డాక్టర్ లేకపోవడంతో కాంపౌండర్ ఇచ్చిన మందులు తీసుకొని వెళ్తున్నారు.

పరీక్షలు బంద్

ల్యాబ్ టెక్నీషియన్ లేక రక్త, మూత్ర పరీక్షలు కూడా చేయడం లేదు. డయాబెటిక్, థైరాయిడ్, లివర్ ఫంక్షన్, రీనల్ ఫంక్షన్, లిపిడ్ ప్రొఫైల్, కొలెస్ట్రాల్, సీబీపీ, మైక్రోబయాలజీ పరీక్షలు చేయడం లేదు.

ఉన్నతాధికారులకు వినతి

పాటిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడు అందుబాటులో లేక ప్రజలకు వైద్యం అందడం లేదని పలువురు ఇటీవల వైద్యశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. జీహెచ్‌ఎంసీలోని హెల్త్ ఆఫీసర్‌ను కలిసి డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ఖాళీగా ల్యాబ్



శ్రీరాములును అభినందిస్తున్న ఏసీపీ సంజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

శ్రీరాములుకు ఎస్‌ఐగా పదోన్నతి

ఖైరతాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో పెద్దన్న పాత్ర పోషించే ఏఎస్‌ఐ శ్రీరాములుకు ఎస్‌ఐగా పదోన్నతి లభించింది. ఇటీవలే ఆయన ఎస్‌ఐ శిక్షణ పూర్తి చేసుకొని ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధుల్లోకి చేరారు. సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ గురువారం ఆయనకు మరో స్టార్ అమర్చి సత్కరించారు. శ్రీరాములుకు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఎన్‌జీవో సంఘాల ప్రతినిధులు, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఫోన్‌పే పేరుతో మోసం

అమీర్‌పేట, మే 29 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌పే పేరుతో ఓ వ్యక్తి విద్యార్థిని మోసం చేశాడు. రూ.10 వేలు నగదు తీసుకుని ఉడాయించాడు. ఈ సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గోపన్నపల్లికి చెందిన అల్లాడి శివ శంకరవరప్రసాద్ ఎస్‌ఆర్‌నగర్‌లోని లక్ష్య కళాశాలలో సీఏ చదువుతున్నాడు. శ్రీ రాజరాజేశ్వరీ బాయ్స్ హాస్టల్లో ఉంటున్న ప్రసాద్ స్థానికంగా ఉన్న కెనరా బ్యాంక్ ఏటీఎం సెంటర్‌కు వెళ్లి రూ.10వేలు డ్రా చేసుకున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తన ఏటీఎం కార్డు పనిచేయడం లేదని, అత్యవసరంగా డబ్బు అవసరపడిందని, రూ.10 వేలు ఇస్తే ఫోన్ పే చేస్తానని నమ్మించాడు. ఫోన్‌పే లావాదేవి జరిగినట్లు ఓ మెసేజ్ చూపించి ప్రసాద్ వద్ద నగదు తీసుకుని వెళ్లిపోయాడు. తర్వాత ఫోన్‌పేలో డబ్బుల కోసం చూడగా కనిపించకపోవడంతో మోసపోయానని గ్రహించి ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి హెల్మెట్, మాస్క్ ధరించి ఉన్నట్లు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దకొడుకు నుంచి రక్షణ కల్పించండి

అమీర్‌పేట, మే 29 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడుకు నుంచి రక్షణ కల్పించాలని వృద్ధ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట గురుద్వారా సమీపంలో ఎస్.అమర్‌సింగ్ భార్యతో కలిసి నివాసముంటున్నాడు. ప్రైవేట్ సెక్యూరిటీగార్డుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్దకుమారుడు జస్బీర్‌సింగ్ ప్రతీ రోజు ఇంటికి వచ్చి తండ్రి అమర్‌సింగ్‌తోపాటు తల్లి మీనాకౌర్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న తండ్రికి వైద్యులు స్టంట్ కూడా వేశారు. కత్తెరతో కడుపుపై గాయపరిచాడు. వృద్ధులనే కనికరం లేకుండా తరుచూ దాడులకు పాల్పడుతున్నాడని బాధితులు తెలిపారు. తమతో పాటు చిన్న కుమారుడైన సుఖ్బీర్‌సింగ్‌కు కూడా పెద్దకుమారుడి నుంచి ప్రాణభయం ఉందన్నారు. అతడి నుంచి రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు బీభత్సం.. తప్పిన ప్రమాదం

హైదర్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధి వివేకానందనగర్‌లో బుధవారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. వివేకానందనగర్ చిత్తారమ్మ దేవాలయం వైపు నుంచి నిస్సాన్ సన్నీ కారు వేగంగా వెళ్తూ అదుపుతప్పి వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ప్రహరీని ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాన్ని అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని స్తంభాన్ని మార్చి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతివేగమే ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని బావిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.



స్తంభాన్ని ఢీకొన్నకారు

రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొన్న బైక్

- చికిత్స పొందుతూ మృతి

హైదర్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న మహిళను వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. కూకట్‌పల్లి ఎల్లమ్మబండలో భీమయ్య, భార్య బాలకిష్టమ్మ నివాసం ఉంటున్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని ఓ హాస్టల్‌లో ఆమె పనిచేస్తుంది. గురువారం ఉదయం పనినిమిత్తం ఎల్లమ్మబండ నుంచి కేపీహెచ్‌బీ కాలనీకి వచ్చి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన బాలకిష్టమ్మను సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. భీమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన బాలకిష్టమ్మ

నిమ్స్ రిటైర్డ్ ఉద్యోగులకు కార్యాలయం ఏర్పాటు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రి రిటైర్డ్ ఉద్యోగుల కోసం సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీనిని ఆస్పత్రి సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణతో కలిసి డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్‌బాబు, రామరాజు శరత్, డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శాంతివీర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రేమిస్తున్నాను.. నాకు నువ్వు కావాలి

- గృహిణికి మెస్సేజ్ పెట్టిన వ్యక్తి

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): 'ప్రేమిస్తున్నాను.. నాకు నువ్వు కావాలి' అంటూ గృహిణికి మెస్సేజ్ పెట్టిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనగర్‌కాలనీ ప్రగతినగర్‌లో నివసించే గృహిణి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.10లో బోటింగ్ నిర్వహిస్తుంది. ఈమె కుమారుడు జూబ్లీహిల్స్‌లోని పాఠశాలలో చదువుతున్నాడు. ఈయనతో అదే పాఠశాలలో చదువుతున్న దీక్షిత్ అనే విద్యార్థి తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. గృహిణి కుమారుడికి దీక్షిత్ తండ్రి మురళి నెంబర్‌తో ఫోన్ చేసేవాడు. కొన్నిరోజుల తర్వాత మురళి గృహిణికి ఫోన్ చేస్తూ దీక్షిత్ చదువు గురించి మాట్లాడేవాడు. ఈనెల 17న ఆమె విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా మురళి అడ్డుపడి మాట్లాడేందుకు ప్రయత్నించాడు. తప్పించుకున్న గృహిణి అతడి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేసింది. మరుసటి రోజు మురళి ఆమెను కలిసి మరోసారి ఇబ్బంది పెట్టను అని చెప్పడంతో అన్ బ్లాక్ చేసింది. కాగా, ఈనెల 27న ఆమె ఫోన్‌కు 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నాకు నువ్వు కావాలి' అంటూ మురళి ఇంగ్లిష్‌లో మెస్సేజ్ పెట్టినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. మురళిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రేమికురాలికి వేధింపులు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రేమికురాలిని వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండలో నివసించే యువతి అక్కడే బోటిక్ నిర్వహిస్తుంది. 2024లో అభిలాష్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కొన్నిరోజులు సహజీవనం చేశారు. అభిలాష్ ప్రతీ విషయానికి ఆమెను బెదిరింపులకు గురిచేస్తుండడంతో వేరుగా ఉంటోంది. అభిలాష్ ఆమెను పలు రకాలుగా వేధించడంతోపాటు నకిలీ ఐడీలతో సోషల్ మీడియాలో ఖాతాలు తెరిచి ఆమె ఫొటోలను స్నేహితులకు పంపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆమె ఉంటున్న అడ్రస్‌కు ఆహార పదార్థాలు ఆర్డర్లు పెడుతూ బిల్లులు చెల్లించేలా చేస్తున్నాడు. ఈ విషయంపై యువతి అభిలాష్‌ను నిలదీయగా, 'నువ్వు ఎలా పెళ్లి చేసుకుంటావో నేను చూస్తా' అంటూ బెదిరించాడు. యువతి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతా..

- బ్లేడ్‌తో చేయి కోసుకున్న యువకుడు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతా అని బెదిరిస్తూ బ్లేడ్‌తో యువకుడు చేయి కోసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ లక్ష్మీనరసింహనగర్‌లో నివసించే యువతి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ఎంఆర్‌డీగా పనిచేస్తుంది. వెంకటగిరిలో నివసించే సమీప బంధువు ఎన్.అరవింద్ రెండు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానంటూ వెంబడించాడు. ఆమె ఒప్పుకోలేదు. పట్టు వదలకుండా వెంబడిస్తుండడంతో ప్రేమను అంగీకరించింది. ఇదే విషయాన్ని యువతి తల్లిదండ్రులకు చెప్పగా వారు వ్యతిరేకించారు. దీంతో తాను పెళ్లి చేసుకోలేనని చెప్పింది. ఈనెల 27న ఆమె ఆస్పత్రిలోని పార్కింగ్‌లో ఉండగా, అరవింద్ అక్కడికి వెళ్లాడు. పెళ్లి చేసుకుంటావా? లేదా? అంటూ ప్రశ్నించాడు. ఆమె కుదరదని చెప్పడంతో తనతో తెచ్చుకున్న బ్లేడ్ తీసి చేతిని కోసుకున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడిని ఆస్పత్రిలో చేర్పించారు. యువతి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను దూషించిన ముగ్గురిపై కేసు

బంజారాహిల్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం పార్కింగ్ విషయంలో మహిళను దూషించిన ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ బస్తీలో నివసించే ఫరా ప్రైవేట్ ఉద్యోగి. ప్రతీ రోజు ఆమె తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్కింగ్ చేస్తుంది. ఈనెల 25న ఈ విషయమై ప్రభాకర్ పల్లె, మంజుల, మోహన్‌తో గొడవ జరిగింది. ప్రభాకర్, మంజుల రెచ్చిపోయి ఫరాను దుర్భాషలాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

యూసుఫ్‌గూడ, మే 29 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీసులు ఇద్దరు వ్యక్తుల నుంచి ఒక గ్రాము గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన షేక్ సోహెల్, జవహర్‌నగర్‌కు చెందిన బోయిన్ సతీష్ యూసుఫ్‌గూడ బస్తీ సులబ్ కాంప్లెక్స్ వద్ద అనుమానాస్పదంగా రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసులకు తారసపడ్డారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా, గంజాయి తాగుతున్నామని అంగీకరించారు. దీంతో వారి నుంచి ఒక గ్రామ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మహిళ అదృశ్యం

ఖైరతాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీలో నివాసముండే ఫాతిమా అలియాస్ రాజమ్మ(43) ఈనెల 22న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమారుడు బాబు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫాతిమా 5 అడుగుల ఎత్తు, నల్లటి రంగులో ఉంటుందని, తెలుగు, హిందీ మాట్లాడుతుందని, ఇంటి నుంచి వెళ్లిన సమయంలో ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉన్నదని ఎస్‌ఐ శ్రీరాములు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గాని, 9912820552లో గాని సంప్రదించాలని పోలీసులు సూచించారు.



రాజమ్మ(ఫైల్)



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

యూపీలో విద్యుత్ ప్రైవేటీకరణకు నిరసన

ఖైరతాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ వ్యవస్థను ఉత్తరప్రదేశ్‌లో ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ సంస్థ పిలుపు మేరకు నగరంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మింట్ కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయం ఎదుట యూపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ యూపీలో 184 రోజులుగా విద్యుత్ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని, వారి సర్వీస్ రెగ్యులేషన్లను మార్చి రిమూవల్ చేసేందుకు అక్కడి ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు.

జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ వ్యవస్థలు ప్రైవేట్ పరం కాకుండా ఎంతవరకైనా వెళ్తామని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు 27 లక్షల మంది విద్యుత్ ఉద్యగులు ఉత్తరప్రదేశ్ ఉద్యోగులకు అండగా ఉన్నారని, వెంటనే అక్కడి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిరసనలో జేఏసీ నాయకులు బిసిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గోవర్ధన్, మోజెస్, శ్రీనివాస్, సదానందం, భూపాల్‌రెడ్డి, తాజుద్దీన్, వరప్రసాద్, వేణు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోరక్ష చట్టాలను కఠినంగా అమలు చేయాలి

పంజాగుట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను వెంటనే మూసివేయాలని, గోరక్ష చట్టాలను కఠినంగా అమలు చేయాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్ పీ) జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బి.నరసింహమూర్తి, గోరక్ష విభాగం ప్రాంత సహ ప్రముఖ్ రమేష్ బాబు, దీపక్, అనిల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గో ప్రేమికులు, గోరక్ష సంస్థలు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా గోహత్య నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గోశాలలను ఏర్పాటు చేయాలని, దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాల్లో గోవులను పెంచాలని, గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న రైతులకు, గోపోషకులకు తగిన ప్రోత్సాహకాలను అందించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శశిధర్



నాలా పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న సబీహాబేగం

నాలా పరీవాహక ప్రాంతాల పరిశీలన

అల్లాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్‌లో కార్పొరేటర్ సబీహాబేగం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. వర్షాకాలం దృష్ట్యా సఫ్దర్‌నగర్ నాలా, పరిసర ప్రాంతాల్లో సమస్యాత్మక ప్రాంతాలను అంచనా వేసేందుకు అధికారులు కలియతిరిగారు. ఈ సందర్భంగా సబీహాబేగం మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా విస్తరణ పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. లేదంటే నాలా పరిసర ప్రాంత ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీసీ వంశీకృష్ణ, టీపీఎస్ కిరణ్‌కుమార్, ఎస్‌ఎన్‌డీపీ ఏఈ శ్రీనాథ్ రెడ్డి, డీఈ రాజ్యలక్ష్మి, ఏఈ రంజిత్, స్థానికులు అబ్దుల్ హమీద్, రియాజ్, షేక్ రఫిక్, సలీం, అస్లాం, మల్లేష్, షఫీ, మహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

కోట్ల స్థలానికి ఎసరు?

కేపీహెచ్‌బీకాలనీ, మే 29 (ఆంధ్రజ్యోతి): పైరవీ చేస్తే చాలు. ఎంత విలువైన స్థలం అయినా పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తారా? కైత్లాపూర్ సమీపంలోని సర్వే నంబర్.939లో రోడ్డు కోసం సుమారు రూ.28 కోట్ల విలువ చేసే 2,800 గజాల స్థలం ఓ ప్రైవేట్ బిల్డర్‌కు అప్పనంగా అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏపీ ప్రభుత్వంతో సన్నితంగా ఉండే ఓ బిల్డర్ సర్వే నంబర్.988లో నాలుగు, ఐదు బ్లాక్‌లుగా రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ కోసం ఈ ఏడాది ఏప్రిల్ 8న జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు పొందారు. ఆ ప్రాజెక్ట్‌కు దారి మాత్రం హౌసింగ్‌బోర్డుకు ఉన్న రెండెకరాల స్థలం మధ్యలో 40 అడుగుల రోడ్డు చూపడం గమనార్హం. ఆలస్యంగా మేల్కొన్న హౌసింగ్‌బోర్డు అధికారులు జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను ఆశ్రయించారు.

రెండెకరాల స్థలం వృథా..

ఉమ్మడి ఏపీహెచ్‌బీలో ఉన్న స్థలం కావడంతో దీనిపై సంబంధిత అధికారులు పెద్దగా దృష్టి సారించకపోవడంతో దీనిపై బడా బిల్డర్లు కన్నేశారు. కైత్లాపూర్ ఆర్వోబీ నుంచి కామునిచెరువు ఆనుకొని ఉన్న స్థలంలో నివాస గృహ సముదాయాలకు శ్రీకారం చుట్టారు. చుట్టూ హౌసింగ్‌బోర్డు స్థలం ఉండడంతో సదరు స్థలంలో నిర్మించే భవనాలకు అనుమతి ఉండదన్న విషయం వారికి ముందే తెలుసు. అధికారులకు ముందే సమాచారం ఇచ్చి అనుమతులకు పోయినట్లు తెలిసింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతులు పొందారని సాకుగా చూపించి ఆ ప్రాజెక్ట్ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్కడ రోడ్డు మూసేస్తున్నారని ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న రెండు అపార్‌మెంట్స్‌వాసుల చేత కోర్టును ఆశ్రయించేలా చేయడంలో కూడా ఇక్కడి అధికారులే కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. జూన్ 11న ఇదే ప్రాంతంలోని ఓ స్థలాన్ని హౌసింగ్‌బోర్డు వేలం వేసేందుకు ప్రకటన జారీ చేసింది. గజం రూ.లక్షగా అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రోడ్డు కోసం వదిలేసే స్థలం కనీస ధర లక్ష కాగా, గరిష్ఠంగా రూ.2లక్షల వరకు ఉండవచ్చు. 120 అడుగుల రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలం వేలం వేస్తే హాట్‌కేక్‌లా అమ్ముడుపోతుందని అధికారులకు తెలుసు. కానీ దీన్ని ముక్కలుగా చేసి బిల్డర్లు, కబ్జాదారులకు మేలు చేసేందుకు హౌసింగ్‌బోర్డులో కుట్ర జరుగుతుందా? అనే అనుమానాలు లేకపోలేదు. ప్రస్తుతం కోర్టుమెట్లు ఎక్కిన వారికి సకాలంలో ఆన్సర్ ఇవ్వకుండా జాప్యం జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. సదరు భవన నిర్మాణదారుడి అనుమతులు రద్దు చేయలేక ఏదో సాకు చూపించి హౌసింగ్‌బోర్డు స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి అప్పగించే కుట్ర జరుగుతుందనే వార్త షికార్లు కొడుతోంది. ఇదే జరిగితే రూ.100 కోట్ల విలువ చేసే స్థలాలను ఇన్‌డైరెక్ట్‌గా కబ్జాదారులకు అప్పగించినట్లే.



బ్లాక్‌లుగా నిర్మిస్తున్న రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లు ఇవే



రోడ్డు కోసం చూపిస్తున్న రూ.28 కోట్ల విలువ చేసే హౌసింగ్‌బోర్డు స్థలం ఇదే

కోర్టు పరిధిలో ఉంది

హౌసింగ్‌బోర్డు స్థలంలో రోడ్డు చూపించి రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌కు జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి పొందింది వాస్తవమే. దీనిపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు కూడా చేశాం. రోడ్డు క్లోజ్ చేసేందుకు మేము పనులు ప్రారంభించే క్రమంలో స్థానికంగా నివాసం ఉండేవారు కోర్టుకు వెళ్లారు. జూన్ 10న హియరింగ్‌కు వస్తుంది. అక్కడ ఇచ్చే తీర్పుకు అనుగుణంగా తదుపరి కార్యాచరణ ఉంటుంది.

- కిరణ్‌బాబు, ఈఈ, వెస్ట్రన్ డివిజన్, టీజీహెచ్‌బీ

శాఖల మధ్య సమన్వయం ఏది?

ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మూడు నెలల క్రితం అధికారుల కళ్లుగప్పి అనుమతి పొందిన బిల్డర్‌పై యాక్షన్ తీసుకోవడంలో తాత్సారం చేయడం వెనక ఉన్న మతలబేంటి? జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్, టీజీహెచ్‌బీ వెస్ట్రన్ డివిజన్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించిన బాణుక నర్మద

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి : బాణుక నర్మద

సికింద్రాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తున్నట్లు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద అన్నారు. 3వవార్డు పరిధిలోని హ్యాపీ ఎన్‌క్లేవ్‌లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జ్యోతి కాలనీలో కాలనీ, కంటోన్మెంట్ బోర్డుకు చెందిన రూ.50ల వ్యయంతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. కంటోన్మెంట్‌లోని ఏ కాలనీవాసులైనా ముందుకు వస్తే ఆయా కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎస్.శ్రీనివాస్, 3వ వార్డు అధ్యక్షుడు అరుణ్, నాయకులు మధు, రమేష్, వనిత, వినోద, అనురాధ, సబిత, ప్రవీణ్, కామిని, సంగీత, అశోక్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

రెజిమెంటల్‌బజార్, మే 29(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ లోపల ఉన్న డ్రైనేజీ పైపులైన్ పాతది కావడంతో తరుచుగా డ్రైనేజీ సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా పండుగ రోజుల్లో ఆలయ గేట్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్ పొంగి డ్రైనేజీ నీరు బయటకు వస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆలయం లోపల ఉన్న పాతపైపు లైను తొలగించి దాని స్థానంలో 12 ఇంచుల పైపులైన్ పనులు చేపట్టారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్య తీరనుంది.



ఆలయం లోపల జరుగుతున్న పైపులైన్ పనులు



మర్యాద పూర్వక కలయిక

బౌద్ధనగర్‌లో ఈస్ట్‌జోన్ ఏసీపీ కార్యాలయంలో గురువారం ఏసీపీ కె.శశాంక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, సభ్యులు సత్యనారాయణ, రఘు, రుద్ర, దేవేందర్, జగదీష్, యాదగిరి తదితరులు. - బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి



గరీబ్‌నగర్ యూపీహెచ్‌సీ

గరీబ్‌నగర్ యూపీహెచ్‌సీలో కాంపౌండరే డాక్టర్

- ఖాళీగా డాక్టర్, నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, డ్రగ్గిస్ట్ పోస్టులు

బేగంపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): పేదలు అధికంగా నివసించే చోట వారికి ఉచితంగా వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్యం అందడం లేదు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బేగంపేట డివిజన్ పాటిగడ్డ మోడల్ మార్కెట్ ప్రాంగణంలోని గరీబ్‌నగర్ యూపీహెచ్‌సీలో ఇద్దరు నర్సులు, డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రగ్గిస్ట్ అందుబాటులో ఉండాల్సి ఉండగా ఎవరూ లేరు. ప్రస్తుతం ఆ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. కాంపౌండర్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇది ఒకటి, రెండు రోజుల నుంచి కాదు ఐదు నెలలుగా అన్నీ తానై వైద్యం చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి తెలిసిన మందులు ఇస్తున్నారు.

నిత్యం 80 నుంచి 90 మంది రోగులు..

పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్, దేవుడి తదితర బస్తీలకు చెందిన పేదలు వైద్యం కోసం వస్తుంటారు. నిత్యం 80 నుంచి 90 మంది వస్తారు. డాక్టర్ లేకపోవడంతో కాంపౌండర్ ఇచ్చిన మందులు తీసుకొని వెళ్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడు అందుబాటులో లేక ప్రజలకు వైద్యం అందడం లేదని పలువురు ఇటీవల వైద్యశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. జీహెచ్‌ఎంసీలోని హెల్త్ ఆఫీసర్‌ను కలిసి డాక్టర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

మల్కాజిగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఓల్డ్ మల్కాజిగిరి హనుమాన్ దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభమయ్యాయి. ప్రాతకాల పూజ, గోపూజ, వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వస్తి పుణ్యావాచనం, ఋత్విక్ బ్రాహ్మణ దీక్షధరణ కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో ప్రతిష్ఠించబోయే అమ్మవారి, స్వామివార్ల విగ్రహాలను సాయంత్రం పురవీధుల ద్వారా వైభవంగా ఊరేగించారు దేవాదాయశాఖ అధికారి వెంకన్నతో పాటు ఆలయ ధర్మకర్త ఎగ్జిక్యూటివ్ అధికారి చింతల మల్లేష్‌గౌడ్, ధర్మకర్త మండల రాధాకృష్ణయాదవ్, హన్మయ్య మాస్టరు, రంగ విజయ్‌కుమార్, బక్కనాగరాజు, శోభన్‌బాబులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడిక తీసేదెప్పుడు?

- మొదలైన వర్షాలు ● భయాందోళనలో ప్రజలు

బౌద్ధనగర్, మే 29(ఆంధ్రజ్యోతి): వర్షాలు మేలోనే కురుస్తుండటం.. నాలాల పూడికతీత పనులు పూర్తికాకపోవటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు నాలాలో నుంచి వర్షపునీరు రివర్స్‌లో వచ్చి ఇళ్లను ముంచెత్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలా పూడికతీత పనులను పూర్తిచేయాలని పలువురు జీహెచ్‌ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో ఉన్న నాలాల్లో చెత్త చెదారం విపరీతంగా పేరుకుపోతోంది. పూడికతీతపనులు చేపట్టినా మరలా నాలాల్లోకి చెత్త చెదారం భారీగా చేరుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. నాలాల్లో పేరుకుపోయిన మట్టి, చెత్త చెదారం వల్ల దుర్వాసన వెదజల్లడంతోపాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో పలువురు అనారోగ్యాల బారిన పడుతున్నారని నాలాల వెంబడి నివసించే స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ భవానీనగర్, అన్నానగర్, శ్రీనివాసనగర్, మహ్మద్‌గూడ నుంచి బౌద్ధనగర్ డివిజన్‌లోని షాబాద్‌గూడ, పుల్లయ్యబావి, న్యూఅశోక్‌నగర్, ఎల్.నారాయణనగర్, ఈశ్వరిబాయినగర్, బౌద్ధనగర్ వరకు నాలాలు విస్తరించి ఉన్నాయి. శ్రీనివాస్‌నగర్‌లో ప్రతి శుక్రవారం సంత నిర్వహిస్తారని, సంత అవగానే వ్యాపారులు చెత్తను పక్కనే ఉన్న నాలాలో పడివేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భారీవర్షాలు కురకముందే నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





శ్రీనివాస్‌నగర్ ఫ్రైడే మార్కెట్ వద్ద నాలాలో పేరుకుపోయిన మట్టి, చెత్తచెదారం

ఇబ్బందులు లేకుండా చూడాలి



బౌద్ధనగర్, సీతాఫల్‌మండిల్లో ఉన్న నాలాల్లో పూడికతీత పనులను చేపట్టి ఇబ్బందులు కలగకుండా చూడాలి. ఇటీవల కురిసిన వర్షాలతో వర్షపునీరు రివర్స్‌గా వచ్చి నాలా పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఇళ్లను ముంచెత్తాయి. నాలాల్లో మట్టి, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి.

- వల్లారపు శ్రీనివాస్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జి, సికింద్రాబాద్

చర్యలు తీసుకోవాలి



నాలాల్లో చెత్త వేసేవారిపై చర్యలు తీసుకోవాలి. నాలాల వెంబడి ఉన్న వ్యాపారులు రాత్రి సమయాల్లో పనికిరాని వస్తువులను పడవేయటం వల్ల వర్షపునీరు ముందుకు వెళ్లటంలేదు. దీంతో భారీగా చెత్తచెదారం పేరుకుపోతుంది. ప్రజలు ఇబ్బందులు పడకుండా నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలి.

- నందారం సీతారాం, బీదలబస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

'పూలే చిత్రాన్ని తెలుగులోకి అనువదించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): పూలే చిత్రాన్ని పన్ను నుంచి మినహాయించి తెలుగులోకి అనువదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన ఓయూ వేదికగా మాట్లాడుతూ ఆ చిత్రంలో చదువు ప్రాముఖ్యతను, దాని విలువను గొప్పగా చూపారని, రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ గురుకులాలు, పాఠశాలల్లో, గ్రామాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఈ చిత్రాన్ని పన్ను రహితంగా చేయడం వల్ల విస్తృత ప్రచారానికి సాధ్యమవుతుందని, విద్యార్థులు, సాధారణ ప్రజలు మహాత్మా జ్యోతిబాపూలే సామాజిక సంస్కరణ ఉద్యమ చరిత్రను బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్, ఓయూ జేఏసీ చైర్మన్ బండి నరేష్, మాల మహానాడు అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌కు ప్రత్యేక హోదా కల్పించాలి

బౌద్ధనగర్, మే 29(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ గురువారం లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖను రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపారు. సీతాఫల్‌మండి కార్యాలయంలో లష్కర్ సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు లేఖను రాశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ 1959వరకు ప్రత్యేక కార్పొరేషన్‌గా కొనసాగిన సికింద్రాబాద్‌ను 1960లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విలీనం చేశారని, అప్పటి నుంచి ఈ ప్రాంతంలో వసూలైన నిధులు మరో ప్రాంతానికి తరలిపోతున్నాయన్నారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీగా విస్తరించిన తర్వాత నిధులన్నీ అభివృద్ధి చెందుతున్న గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్, రాయదుర్గం ప్రాంతాలకు తరలివెళ్లటంతో సికింద్రాబాద్‌తో రోడ్ల విస్తరణ, నూతన ఫ్లైఓవర్, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడలేదని అన్నారు. 2006లో సికింద్రాబాద్‌కు అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి రెండు వందల కోట్ల రూపాయలు నిధులు కేటాయించారని, ఆయన మరణం తర్వాత అవి మరుగున పడ్డాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి నిధులు కేటాయిస్తున్నా అవి సికింద్రాబాద్ ప్రజలకు అందటం లేదన్నారు. ప్రజల కోరిక మేరకు సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక హోదా కల్పించి, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించి న్యాయం చేయాలని కోరారు. లేఖ రాసిన వారిలో ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్ యాదవ్, సభ్యులు సునీల్ ముదిరాజ్, మిట్టపల్లి బాబురావు, శైలేందర్, రవీందర్ సాగర్, అశోక్, కృష్ణ, అజీజ్ తదితరులున్నారు.



సీఎంకు రాసిన లేఖతో లష్కర్ జిల్లా సాధన సమితి సభ్యులు



పికెట్ క్యాంపు కార్యాలయం నుంచి జైహింద్ ర్యాలీ సభకు కంటోన్మెంట్ కాంగ్రెస్ కార్యకర్తలతో తరలివెళ్లిన ఎమ్మెల్యే శ్రీగణేష్

ఆపరేషన్ సింధూర్‌ని రాజకీయాలకు వాడుకోవటం సిగ్గుచేటు

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సింధూర్‌ని బీజేపీ రాజకీయాలకు వాడుకుంటున్న తీరును ఎండగడుతూ గురువారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జైహింద్ యాత్ర సభను కుత్బుల్లాపూర్ నియోజవవర్గంలోని వీఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభను ఏర్పాటు చేసింది. ఈ సభలో పాల్గొనడానికి పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే శ్రీగణేష్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు చేసిన దమనకాండకు వ్యతిరేకంగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్‌ని చేపట్టి సరైన సమాధానం చెప్పిందన్నారు. ఈ విజయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. పహల్గాం దాడి జరగగానే కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి తన పూర్తి మద్దతును అందజేస్తుందని చెప్పిందని గుర్తు చేశారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, జైహింద్‌యాత్రను నిర్వహిస్తున్నారని, ఈ ర్యాలీలో పాల్గొనడానికి విచ్చేసిన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏజీసీసీ ఎక్స్ సర్వీస్‌మన్ ఛైర్మన్ రోహిత్ చౌదరి, రాష్ట్ర మంత్రులకు స్వాగతం పలికి జైహింద్ ర్యాలీ, సభలో పాల్గొనడానికి కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలి వెళ్తున్నామని తెలిపారు.

మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో బైకు పంచాయితీ

- బైక్ ఆచూకీ తెలిసిందని బాధితుడికి ఫోన్
- గుర్తుతెలియని వ్యక్తికి బైకును అప్పజెప్పిన కానిస్టేబుళ్లు
- కానిస్టేబుళ్లపై సీఐ ఆగ్రహం

అడ్డగుట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో చోరికి గురైన బైకు ఆచూకీ లభించిందని బాధితుడికి ఫోన్ చేసిన కానిస్టేబుళ్లు. అక్కడినుంచి సంతోషంగా వచ్చిన బాధితుడికి చేదు అనుభవం. బైకును మరో వ్యక్తికి అప్పగించిన కానిస్టేబుళ్లు. మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో బైకు పంచాయితీపై అసలేం జరిగింది. సిరిసిల్ల తంగపల్లికి చెందిన నందగిరి భాస్కర్ గౌడ్ సిరిసిల్ల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా ఉన్నాడు. 2020 మే 10న ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఫైనాన్స్ కట్టలేదు కాబట్టి బైకును తీసుకెళుతున్నానని చెప్పి తీసుకెళ్లిపోయాడు. భాస్కర్ గౌడ్ బైక్‌ను తీసుకెళ్లిన వ్యక్తి గురించి ఫైనాన్స్ కంపెనీలో ఆరా తీయగా వారు మీ బైకును ఎవరు తీసుకురాలేదని చెప్పారు. దీంతో బాధితుడు తంగపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సికింద్రాబాద్‌లో మార్కెట్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకవైపు నంబర్ ప్లేట్ లేదని ఇద్దరు కానిస్టేబుళ్ల బైకు నడిపిన వ్యక్తితో పాటు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. గురువారం ఉదయం సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్ నుంచి ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు బాధితుడైన భాస్కర్‌గౌడ్‌కు ఫోన్ చేసి మీకు బైకు ఆచూకీ దొరికిందని, మార్కెట్ పోలీస్‌స్టేషన్ రావాలని చెప్పడంతో అతడు సిరిసిల్ల నుంచి స్టేషన్‌కు వచ్చాడు. బైకు గురించి విచారించగా పోలీసులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే భాస్కర్‌గౌడ్‌కు ఇవ్వాల్సిన బైకును మరో గుర్తుతెలియని వ్యక్తికి ఇద్దరు కానిస్టేబుళ్లు ఇచ్చి పంపించారు. బాధితుడు ఇదేమని ప్రశ్నిస్తే ఏమి చెప్పాలో తెలియక మళ్లీ బైకు తెప్పించి ఇప్పిస్తామని పోలీసులు రాయబారానికి దిగారు.



దొంగ తీసుకువెళ్లిన బైకు

బైకు తెప్పించి ఇస్తాం

సిరిసిల్లలో బైకు చోరీ ఘటన జరిగింది. ఫైనాన్స్‌లో పనిచేస్తున్న ప్రవీణ్ అనే పేరు చెప్పి బైకు తీసుకెళ్లినట్లు తెలిసిందని, బేగంపేట్‌లో ఐడీబీఐ బ్యాంకులో లోన్ ఉందని అయినప్పటికీ ఈ బైకు ఎవరు తీసుకువెళ్లారనే విషయంపై ఆరా తీస్తున్నాం. ఏదిఏమైనా బాధితుడికి బైకు ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అసలు జరిగిన విషయంపై కూడా ఆరా తీస్తున్నాం.

- సీఐ రాంచందర్

జీవో జారీ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

బర్కత్‌పుర, మే 29(ఆంధ్రజ్యోతి): బీసీ 42శాతం రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో జారీ చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. జీవో జారీ చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో ఉద్యమ బా ట పడుతామని ఆయన హెచ్చరించారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణభారత ఇన్‌చార్జి సూర్యనారాయణతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి సన్నాహాలు చేస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసిందని, 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ఇంత వరకు ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదన్నారు. బీసీ రిజర్వేషన్లు పెం చుతూ తక్షణమే జీవో జారీ చేస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని, రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటోందని, కేంద్రంపై నెట్టవద్దన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకుడు అజయ్‌బాబు తదితరులు

ప్రభుత్వ భూముల్లో సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలి

అడ్డగుట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి అజయ్‌బాబు, ఆర్.మల్లేష్‌లు తెలిపారు. గురువారం మారేడుపల్లి తహసీల్దార్ బీమయ్యగౌడ్‌కు సీపీఎం నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ఖాళీగా ఉన్న స్థలాల్లో భూ కబ్జాదారులు కబ్జా చేసి భవనాలు నిర్మిస్తున్నారని, ప్రశ్నిస్తే కోర్టు స్టే తీసుకొచ్చామంటూ యజమానులు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాల్లో ప్రభుత్వ స్థలమంటూ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సీపీఎం నాయకులు మల్లేష్, బాలయ్య, ఎల్లయ్య, అంజమ్మ, ఫాతిమా, రేణుక, చారి, రాములు ఉన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహకాలు

రాంగోపాల్‌పేట్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర ప్రకటించారు. గురువారం పాన్‌బజార్‌లోని డివిజన్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర సత్యనారాయణ (శ్రీకాంత్)తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీలో మంచి మార్కులు సాధించి వారికి ప్రతిభ ఆధారంగా మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు, మూడో బహుమతి రూ.2500 ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే మరో పదిమందికి వెయ్యి రూపాయల చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు. ఈ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన దరఖాస్తులను జూన్ 1 నుంచి పాన్‌బజార్‌లోని డివిజన్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో తీసుకోవాలని వెల్లడించారు.

దరఖాస్తులను పూర్తిచేసి జూన్ 15లోగా కార్యాలయంలో సమర్పించాలని వివరించారు. మూడు సంవత్సరాల నుంచి పంపిణీ చేస్తున్న నోట్ బుక్స్‌ను ఈ సంవత్సరం కూడా 4వందల మంది విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా నిరంతరం శ్రమిస్తూ రాంగోపాల్‌పేట్ డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, బల్దియా నిధులే కాకుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకారంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కార్యకర్తలకు, డివిజన్ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నామన్నారు. సమావేశంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ సహ కోశాధికారి ఎస్సార్ మల్లేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ వ్యాస్, గోపి కిషన్, నాయకులు ఈ.శ్రీనివాస్, నితేష్ బోలే, నరేంద్ర పాల్, ప్రవీణ్, ధన్‌రాజ్, మహేష్, వేణు, ఎచ్.శ్రీనివాస్, ఎస్.శ్రీను, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర, తదితరులు

బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోండి

- డాక్టర్ మిట్టపల్లి సృజల

బౌద్ధనగర్, మే 29(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్ కాలనీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మిట్టపల్లి సృజల కోరారు. ఇటీవల జంగ్‌మెంట్ వట్టిపల్లి నుంచి ఇందిరానగర్‌కాలనీ బస్తీ బస్తీ దవాఖానాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పేద ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం(ఆరోగ్య పరమం ధనమ్) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బస్తీ బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశాయన్నారు. ఇక్కడికి వచ్చేవారికి అన్ని వసతులున్నాయని, ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఏఎన్‌ఎం, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

జనరల్ వైద్య పరీక్షలు, మహిళలకు ప్రత్యేక వైద్య సదుపాయాలు ఉన్నాయని ఆమె తెలిపారు. అలాగే గర్భిణీ, ప్రసవ సంరక్షణ, నవజాత శిశువు, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, కంటి, ఈఎన్‌టీ సంరక్షణ, నోటి ఆరోగ్య సంరక్షణ, అత్యవసర వైద్యసేవలు, మానసిక ఆరోగ్య సమస్యల స్క్రీనింగ్, నివారణ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వాతావరణంలో మార్పులు వస్తున్నాయని ప్రస్తుతం వేసవికాలంలో వర్షాలు కురుస్తున్నాయని దీంతో సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశముందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇందిరానగర్‌కాలనీలో బస్తీదవఖాన ఉదయం తొమ్మిదిగంటల నుండి సాయంత్రం నాలుగుగంటలకు వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



బస్తీ దవాఖానాలో మహిళతో మాట్లాడుతున్న వైద్యురాలు మిట్టపల్లి సృజల